ప్రైవేట్ వాహనదారులతో ఇక్కట్లు

● జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు డ్రైవర్ల అవస్థలు ● పట్టించుకోని పోలీసులు

జోగిపేట(అందోల్): అసలే ఇరుకైన బస్టాండ్.. ప్రతి రోజు 90కి పైగా ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగుతాయి. బస్టాండ్ కంపౌండ్‌లోనే కార్లు, బైకుల పార్కింగ్ చేయడం వల్ల ప్రయాణికులతో పాటు బస్టాండ్‌లోకి వచ్చే బస్సులను స్టాండ్‌కు తీసుకొచ్చేందుకు డ్రైవర్లు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. జోగిపేట బస్టాండ్ మీదుగా సంగారెడ్డి, హైదరాబాద్, పటాన్‌చెరువు, నారాయణఖేడ్, నిజామాబాద్, సిద్దిపేట, మెదక్ పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ప్రతి రోజు వంద ట్రిప్పుల వరకు బస్సులు వచ్చి వెళ్తుంటాయి. బస్టాండ్‌కు చుట్టూ పక్కన ఉన్న వారంతా కార్లను బస్టాండ్ ఆవరణలోనే పార్కింగ్ చేస్తున్నారు. అలాగే, బైకు స్టాండ్ ఉన్నప్పటికీ అందులో పెట్టకుండా బస్టాండ్ కంపౌండ్ వాల్ లోపలే పెడుతున్నారు. పట్టించుకునేవారు లేకపోవడంతో వాహన యజమానులు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాన్ని పార్కింగ్ స్థలంగా వాడుకుంటున్నారు.



జోగిపేట బస్టాండ్‌లో పార్కింగ్ చేస్తున్న ప్రైవేట్ వాహనదారులు

పట్టించుకోని పోలీసులు..

రోడ్డుపై వాహనాలు నిలిపితే చలాన్లు వేసే పోలీసుశాఖ ఆర్టీసీ బస్టాండ్ కంపౌండ్‌లో నోపార్కింగ్ ఏరియాలో వాహనాలు నిలిపినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై ఆరోపణలున్నాయి. బస్టాండ్ పక్కనే కూరగాయల మార్కెట్, మెయిన్ బజారు ఉండడంతో చాలా వరకు వాహనాలను బస్టాండ్‌లో పార్కింగ్ చేసి తమ పనులను పూర్తి చేసుకుంటున్నారు. బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలను పార్క్ చేయకుండా చూడాల్సిన పోలీసులు ఎందుకు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.



బస్టాండ్‌లో బైక్‌లు పార్కింగ్

ప్రహరీగోడ లేకపోవడం వల్లే..

ఆర్టీసీ బస్టాండ్‌కు పడమర వైపు ప్రహరీగోడ నిర్మాణం చేపట్టకపోవడంతో అవతలి రోడ్డుకు వెళ్లేందుకు వీలుగా రహదారిని వదిలిపెట్టారు. దీంతో ప్రైవేట్ వాహనదారులు తమ వాహనాలను బస్టాండ్‌లో పెట్టి ఆ దారిగుండా వెళ్లి పనులు చూసుకుంటున్నారు. అవతలి రోడ్డు వైపు నివాసగృహాలు ఉన్న వారు సైతం బస్టాండ్ స్థలాన్నే పార్కింగ్‌కు వాడుకుంటున్నారు. బస్టాండ్ చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేస్తే బస్టాండ్‌లోకి వాహనాలు వచ్చే అవకాశం ఉండదని ప్రయాణికులు, స్థానికులు అంటున్నారు.

ప్రైవేట్ వాహనాలు రాకుండా చర్యలు

జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. బస్టాండ్ చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపడుతున్నాం. అది పూర్తి కాగానే వాహనాలు బస్టాండ్‌లోకి వచ్చే అవకాశం ఉండదు. మార్కెట్‌కు వచ్చే వారు వాహనాలు పార్కింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. కంట్రోలర్ పలుసార్లు వాహనదారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ వాహనాలు బస్టాండ్‌లోకి రావడం వల్ల బస్సులు లోపలికి వచ్చే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొద్దిరోజుల్లో ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

– ఉపేందర్, సంగారెడ్డి డిపో మేనేజర్

క్లుప్తంగా

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న వీఓఏలు

ఝరాసంగం(జహీరాబాద్): మహిళా సంఘాల్లో విధులు నిర్వహించే వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్నట్లు చెప్పారు. ఆరోజు విధులకు హాజరుకాబోమని మంగళవారం ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్‌లను అందించాలన్నారు. కనీస వేతనం రూ. 20 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు ఖాజా, సిరాజుద్దీన్, మహమ్మద్, భాగన్న, సాఫీవుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

నారాయణఖేడ్: ఖేడ్ ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో వివిధ కేసుల్లో పట్టుపడి సీజ్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను 20న వేలం వేయనున్నట్లు సీఐ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బజాజ్ ప్లాటిన, బజాజ్ పల్సర్ వాహనాలు ఉన్నా యని తెలిపారు. గురువారం ఉ.11గంటలకు కార్యాలయం ఆవరణలో వేలం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

ఝరాసంగం(జహీరాబాద్): రేణుకఎల్లమ్మ ఆలయ 31వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు మంగళవారం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామ మహిళలు భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవం నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య ఆలయానికి చేరుకున్నారు. ప్రదక్షిణ వేసి అమ్మవారికి బోనాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

జేఏసీకి విరాళాలు అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన దీక్షలు 42వ రోజుకు చేరాయి. మంగళవారం గ్రామంలోని శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. స్థానిక రజక సంఘం తరపున రూ.5 వేలు, నగరానికి చెందిన ప్రసాద్, రామరాజులు రూ.10 వేలు జేఏసీ నాయకులకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. నిరసన కార్యక్రమాలకు అన్ని వర్గాల నుంచి ఆర్థికంగా, ప్రత్యక్షంగా మద్దతును తెలుపుతున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. నల్లపోచమ్మ దేవస్థానం సమీపంలో వేపచెట్టు కింద చిత్తు కాగితాలు ఏరుకునే గుర్తుతెలియని వ్యక్తి పడుకున్న చోటే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి చేతికి శివుడి డమరుకం స్టీల్ కడియంఉండటాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వట్‌పల్లి(అందోల్): మండలంలోని ఖాదిరాబాద్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు మంగళవారం వట్‌పల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్ జ్యోషి మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున్న విద్యార్థులు బాగా చదివి ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు కిషన్‌రావు, పెద్దన్న, మొయినోద్దీన్ పాల్గొన్నారు.

పదవ తరగతే కీలకం



వినతి పత్రం అందజేస్తున్న వీఓఏలు

జోగిపేట(అందోల్): విద్యార్థుల జీవితాన్ని మార్చేది పదవ తరగతేనని జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య అన్నారు. మంగళవారం జోగిపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. 21 నుంచి ప్రారంభం కానున్న పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. మాజీ కౌన్సిలర్ శివశంకర్ మాట్లాడుతూ.. పాఠశాల నుంచి కళాశాల స్థాయికి చేరుకునే కీలకమైన సమయన్నారు. ప్రధానోపాధ్యాయుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణను తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని, చక్కటి జీవితం మీ భవిష్యత్తుకు ముడిపడి ఉందన్నారు.

అంగన్‌వాడీల చలో హైదరాబాద్

ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు తమ డిమాండ్‌లు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక దీక్ష రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నా నేటికీ వారికి కనీస వేతనం అందకపోవడం పాలకుల నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. ఐసీడీఎస్ బలోపేతానికి నిర్ణయాలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వహించడానికి కొత్తకొత్త పథకాలను తెస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలకు పెంపు సాధ్యం కానీ మోదీకి ప్రైవేటు పరం చేసే ఆలోచన ఎక్కడిదని ప్రశ్నించారు? ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరికి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశంలోనే చర్చించి వేతనాల పెంపు కోసం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంలోనే చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, నాయకులు, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీలు

అంబేడ్కర్ విగ్రహం వద్ద మరమ్మతులు చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మరమ్మతుల పనులు చేపట్టాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఇక్కడ వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. విగ్రహం చుట్టూ ఉన్న వాటర్ ఫౌంటేన్, గ్రిల్స్, టైయిల్స్ దెబ్బతిన్నాయని వాటికి మరమ్మతులు చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ 31 వరకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు బాలరాజ్ కొనింటి నర్సింలు, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ

వట్‌పల్లి(అందోల్): వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులను సాధించాలని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని బిజిలీపూర్ గ్రామంలో సాగవుతున్న వరి పంటను ఏఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించి జింకు లోపాలను గుర్తించారు. ఈ సందర్భంగా యాసంగి సీజన్‌లో జింకు ఆవశ్యకతను గురించి వివరించి ఎకరానికి 20 కిలోల చొప్పున జింకు సల్ఫేట్ ఆఖరి దుక్కిలో వేసుకోవాలన్నారు. అలాగే, పంట నిరోధక శక్తిని పెంచడానికి పోటాషియం తప్పనిసరిగా వాడాలని సూచించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించి పంటను సంరక్షించుకోవాలని సూచించారు. ఏఈఓ మహేష్ వారి వెంట పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం ఏర్పాటు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అనంతారం గ్రామపంచాయతీలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 21 మందికి వైద్య బృందం క్షయ పరీక్షలు నిర్వహించి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి తెమడ పరీక్షలు నిర్వహించి.. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాధికారి మధుకర్, టీబీ ఫీల్డ్ అధికారి కృష్ణ, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి సురేష్‌యాదవ్, సిబ్బంది శివా నర్సిరెడ్డి, ఏఎన్ఎం వసుంధర, సునీత సువాసిని, ఆశాలు గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు ఆరోగ్య కేంద్ర సిబ్బంది రోగులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రోడ్డు పనులు పూర్తి చేయండి



ఆర్డీఓకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ నుంచి సిర్గాపూర్ మీదుగా మాసాన్‌పల్లి క్రాస్‌రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయించాలని మంగళవారం ఆర్డీఓ అశోక చక్రవర్తికి పలువురు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డు గుండా ఖేడ్, సిర్గాపూర్, కంగ్టి, కల్హేర్ మండలాల్లోని అనేక గ్రామాలతో పాటు కామారెడ్డి జిల్లాకు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. రెండేళ్ల కిందట ప్రారంభం కాగా మధ్యమధ్యలో నెలల తరబడి పనులు చేపట్టకపోవడంతో ఇప్పటికీ సగం పనులు సైతం పూర్తికాకపోగా వాహనదారులు ఇబ్బందులతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశాలకు దరఖాస్తులు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ఐనోల్ పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలుర/బాలికల పాఠశాలల్లో 6, 7, 8 ,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల ప్రిన్సిపాల్ స్రవంతి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టికెట్లను ఏప్రిల్ 15న డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్ష ఏప్రిల్ 20న నిర్వహిస్తారని చెప్పారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 9 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు, ఒకరికి రూ .1500, మరో వ్యక్తికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌పోలీసులు పేర్కొన్నారు.

ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణ

రాయికోడ్(అందోల్): సెల్‌ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ నారాయణ గ్రామ సమైక్య సంఘాలకు సూచించారు. రాయికోడ్‌లోని ఐకేపీ భవనంలో వీఓఏలకు, గ్రామ సంఘాల మహిళలకు మానవఅక్రమ రవాణా, సైబర్ నేరాలు, వివిధ మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహనా సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ఏపీఓ నర్సింలు, ట్రేనర్లు కుమారి, జ్యోత్స్న మహిళల లైంగిక వేధింపులు, రక్షణ చట్టాలు, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దన్నారు. ఉద్యోగం, ఉపాధి, ఫేక్ వెబ్‌సైట్‌ల ద్వారా మహిళలను వేధించడం, ఆర్థిక నష్టాలను కలిగించడం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్ వాడకంపై మహిళా సంఘాలు పూర్తి అవగాహన కలిగి ఉండి గ్రామాల్లోని ప్రజలను చైతన్య పరచాలన్నారు. మహిళల భద్రతకు ఇలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు చేపట్టి మహిళల భద్రతను కాపాడుతామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల వీఓఏలు, సీసీలు, గ్రామ సంఘాల నాయకులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

కూలీ కుటుంబాలకు స్వయం ఉపాధి

జహీరాబాద్ టౌన్: ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు స్వయం ఉపాధి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని..వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ పూజా అన్నారు. మొగుడంపల్లి రైతు వేదికలో మంగళవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం కింద వంద రోజుల పని పూర్తి చేసిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం స్వయం ఉపాధి శిక్షణ ఇస్తుందన్నారు.శిక్షణ ద్వారా జీవనోపాధి పొందే అవకాశం కలుగుతుందన్నారు. సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫొటోగ్రఫీ, కంప్యూటర్ అకౌంటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. త్వరలో డైయిరీ రంగంలో కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం కొమరయ్య, ఎంపీడీఓ మహేష్, ఏపీఓ గణేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఐకేపీ కోఆర్డినేటర్లు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ పూజ

వర్గీకరణ ప్రకారమే నియామకాలు

జహీరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాలు ఎస్సీ వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏడవ రోజు దీక్షలో ఆయా సంఘాల నాయకులు కూర్చున్నారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ జరిగితే మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మూడు దశాబ్దాలుగా శాంతియుతంగా నడుస్తున్న పోరాటం ఫలితమే వర్గీకరణ అని అన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న రిలే నిరసన దీక్షలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఎమార్పీఎస్ నాయకులు చేపట్టిన దీక్షలు 8వ రోజుకు చేరాయి. ఈ దీక్షకు మ ద్దతుగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు వీరయ్య మాట్లాడుతూ.. మాదిగ, మాదిగ ఉప కులాలకు జనాభా తమాషా ప్రకారం 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో చెప్పిన విధంగానే అసెంబ్లీ సమావే శాలలో ఎస్సీ మాదిగ ఉప కులాలకు వర్గీకరణ చట్టం అమలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న దీక్ష

జాతరలు సంప్రదాయానికి ప్రతీక

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం వావిలాలలో మంగళవారం మల్లికార్జునస్వామి జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. మల్లన్నస్వామి దయతో జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకులు అశోక్, లక్ష్మణ్, రమణసింగ్, వెంకటేష్, సత్యనారాయణ, రాజు, నంద పాల్గొన్నారు.



జాతరలో బీజేపీ నాయకురాలు గోదావరి

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

సంగారెడ్డి టౌన్ : మహిళా సంఘాల సభ్యులకు రాబోయే విద్యా సంవత్సరం నాటికి పాఠశాలల్లోని యూనిఫామ్‌లు కుట్టడానికి శిక్షణ ఇస్తున్నామని సంగారెడ్డి ఏపీఎం వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డిలోని శిక్షణ కార్యాలయంలో మంగళవారం కంది, సంగారెడ్డి, కొండాపూర్ మూడు మండలాల మహిళా సంఘాల సభ్యులకు హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మహిళల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రణాళికా ప్రకారం ప్రతి పాఠశాలకు యూనిఫామ్‌లు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు, మహిళా సంఘం సభ్యులు, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.



కుట్టడంలో శిక్షణ కల్పిస్తున్న ట్రైనర్లు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సుధాకర్‌రెడ్డి

రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తక్కడపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతి కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మంపల్లి సంగమేశ్వర్, శంకరయ్యతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచ్-1 (కోడ్ : 05172)

2వ అంతస్తు, TSRTC కమ్యూటర్ అమెనిటీ సెంటర్, బస్ టర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్-500 095, T.S.,

ఫోన్ : 040-24651352, ఇ-మెయిల్ : sbi.05172@sbi.co.in

డిమాండ్ నోటీసు

దిగువ **రుణగ్రహీత: శ్రీ మహమ్మద్ జహీన్ అహ్మద్, తండ్రి మహమ్మద్ ఫహీమ్, గ్యారంటార్: శ్రీ హైదర్ అలీ సయద్, తండ్రి ఖాసిం అలీ సయద్** బ్యాంక్ నుండి వారిచే వినియోగించుకోబడిన రుణ సదుపాయాల అసలు మరియు వడ్డీ తిరిగి చెల్లించుటలో విఫలమైనారని మరియు సదరు రుణములు నిరర్థక ఆస్తులు (NPA) గా వర్గీకరించబడినవని ఇందుమూలంగా తెలియజేయడమైనది. వారికి సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13 (2) క్రింద వారి యొక్క చివరిగా తెలిసిన చిరునామాలకు వారికి నోటీసులు జారీచేయబడినవి, కానీ అవి అందజేయబడకుండా తిరిగి వచ్చినవి. కావున ఈ బహిరంగ ప్రకటన ద్వారా వారికి ఇందుమూలంగా తెలియజేయడమైనది.

రుణగ్రహీత, గ్యారంటార్ పేరు మరియు చిరునామా	ఎన్‌ఫోర్స్ చేయబడే ఆస్తుల వివరాలు / సెక్యూర్డ్ అసెట్స్ చిరునామా	నోటీసు తేది	NPA తేది	మొత్తం బకాయిలు (నోటీసు తేది నాటికి)
రుణగ్రహీత: శ్రీ మహమ్మద్ జహీన్ అహ్మద్, తండ్రి మహమ్మద్ ఫహీమ్, డి.నం.4-2-48, వతన్ బాగ్, జహీరాబాద్, సంగారెడ్డి జిల్లా, మెదక్ - 502220, మొబైల్ నం.9676472008. **గ్యారంటార్: శ్రీ హైదర్ అలీ సయద్, తండ్రి ఖాసిం అలీ సయద్,** ప్లాట్ నం.67/B, మూసానగర్ కాలనీ, పాత M.R.O. ఆఫీస్ ఎదుట, జహీరాబాద్, అల్లీపూర్, మెదక్ - 502316, మొబైల్ నం.9866907786. **అకౌంట్ నంబర్లు: 62505693954 & 620505694471.**	సంగారెడ్డి, మెదక్ జిల్లా - 502220, జహీరాబాద్, హోతి "K" గ్రామం, గ్రామపంచాయతీ, బృందావన్ ఎన్‌క్లేవ్, మేరీ గోల్డ్ బ్లాక్, L.P. No.328/08/HRO/H2, సర్వే నం.27/EE, ప్లాట్ నం.4 పై గల గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు కలిగి 205 చదరపు గజాల విస్తీర్ణం, SRO జహీరాబాద్ వద్ద సేల్ డీడ్ నం.2493/2016 తేది: 15-03-2016 ప్రకారం నమోదై శ్రీ మహమ్మద్ జహీన్ అహ్మద్‌కు చెందిన నివాస ఇండిపెండెంట్ డూప్లెక్స్ ఇల్లు యావత్తు. సరిహద్దులు: **ఉత్తరం:** 40' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నం.05, **తూర్పు:** ప్లాట్ నం.01 (లోటస్ బ్లాక్), **పశ్చిమం:** ప్లాట్ నం.03.	1/3/2025	14/4/2024	01-03-2025 నాటికి **రూ.24,46,745/-** (ఇరవై నాలుగు లక్షల నలభై ఆరువేల ఏడు వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) ప్లస్ అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥ వాటితో పైన తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్యత్ వడ్డీ.

నోటీస్ యొక్క ప్రత్యామ్నాయ సర్వీసు కొరకు చర్యలు తీసుకోబడుతున్నవి. ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా బకాయి మొత్తాన్ని చెల్లించాలని పైన తెలిపిన రుణగ్రహీత(లు) మరియు / లేదా వారి గ్యారంటార్ (లు) (వర్తించినపుడు) ఇందుమూలంగా కోరబడుచున్నారు, లేనిచో సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13లో సబ్-సెక్షన్ (4) క్రింద ఈ నోటీస్ తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకోబడును. **సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలు గమనించవలసిందిగా రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.**

తేది: 18-03-2025, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SARB